


# కరపత్రం

SINCE 2014

మంగళవారం జూలై 01 2025 | సంపుటి :0 | సంచిక :256 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## పాశమైలారం ప్రమాద ఘటన.. ప్రభుత్వ కమిటీ ఏర్పాటు



హైదరాబాద్:
సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన ఘోర ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేతృత్వంలో సహాయకచర్యల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో సభ్యులుగా డీఆర్‌ఎఫ్ స్పెషల్ సీఎస్, కార్మిక శాఖ సీఎస్‌ను నియమించారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను కమిటీ సిఫార్సు చేయనుంది.మరోవైపు క్షేత్రస్థాయిలో జరుగుతున్న సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సీఎం ఆరాతీస్తున్నారు. తాజా పరిస్థితులను మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఉదయం 10గంటలకు ఘటనాస్థలికి సీఎం వెళ్లనున్నారు.





## పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

### మంటలు చెలరేగి పదిమంది దుర్మరణం

- వెంటనే సహాయక చర్యలకు దిగిన అధికారులు
- వివిధ ఆస్పత్రుల్లో క్షతగాత్రులకు చికిత్స

**సంగారెడ్డి,జూన్26:**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఉన్న సీగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో భారీ పేలుడు సంభవించడంతో పరిశ్రమ తునాతునకలైపోయింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఉదయం 9 గంటల సమయంలో సీగాచి కెమికల్స్‌లో పని సాగుతున్న సమయంలో రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పేలుడు ధాటికి కంపెనీ షెడ్డు పూర్తిగా కూలిపోయింది. మంటలు తక్కువ సమయంలోనే పరిశ్రమ మొత్తం వ్యాపించడంతో కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. అయినప్పటికీ, పలువురు కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు కార్మికులు మంటల్లో సజీవదహనమయ్యారు. మిగతా మృతుల మరణానికి తీవ్ర గాయాలు కారణమయ్యాయని తెలుస్తోంది. శిథిలాల కింద ఇంకా 15 మంది కార్మికులు చిక్కుకుపోయి ఉండొచ్చని అనుమానించడంవల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. గాయపడ్డ 38 మందిలో 20 మందిని చందానగర్ ప్రభుత్వాస్పత్రికి, మరో 18 మందిని ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే 8 ఫైరింజన్లు ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తేవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. శిథిలాల తొలగింపునకు భారీ క్రేన్‌లు, హైడ్రా మిషన్‌లను రంగంలోకి దించారు.

మిగతాద్ది 2 లో




మిగతాది 2లో

## లక్షల కోట్లు దోచుకుతిన్నారు.. బీఆర్‌ఎస్ పై మంత్రి పొంగులేటి ఫైర్

వరంగల్:
ఖమ్మం జిల్లా నుంచి బీఆర్‌ఎస్ పార్టీ వాళ్లను అసెంబ్లీ గేటు తాకనీయనని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాగ్ధానం చేశార.. చెప్పినట్లే ఒక్క గులాబీ పార్టీ ఎమ్మెల్యేను గేటు తాకనీయలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో లక్షల కోట్లు అవినీతి చేశారని బీఆర్‌ఎస్ పై ఫైర్ అయ్యారు. బీఆర్‌ఎస్ వాళ్లకు పదవి లేకపోయే సరికి పేద ప్రజలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు.సోమవారం (జూన్ 30) పొంగులేటి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా రాయపర్తి మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత కష్టం వచ్చినా పేదవాడి కలలను సహకారం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్యంలో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.



## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు.. కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: హరీశ్‌రావు

హైదరాబాద్:
పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇది భారాస, తెలంగాణ ప్రజల పోరాట విజయమన్నారు. తెలంగాణ జలాలపై ఏపీ చేస్తున్న కుట్రలకు ఇదో చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిలిపివేసేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.




## 'మీకో దండం.. మీ పార్టీకో దండం'.. బీజేపీకి రాజాసింగ్ రాజీనామా

తెలంగాణ బీజేపీలో రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల కల్లోలం రేపింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. చాలాకాలం తర్వాత బీజేపీ కార్యాలయానికి వచ్చిన ఆయన.. కాసేపటికే ఈ ప్రకటన చేయడం గమనార్హం.

2 లో




## ఉచిత బస్సు పొందిన 191 కోట్ల మంది మహిళలు

- వారి ప్రయాణం విలువ రూ.6,300 కోట్లు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్,జూన్ 30:
హైదరాబాద్ నగరంలో కొత్తకాలనీలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా కొత్త రూట్లలో ప్రయాణికుల సౌకర్యాలు పెంచేలా ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా సర్వీసులు నడిపేందుకు ఆర్టీసి సిద్దంగా ఉందన్నారు. ఒకే రూట్‌లో వెళ్లే వారుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వారికి ప్రత్యేక బస్సులు వేస్తామని హామీ ఇచ్చారు.

2 లో

## పథకం ప్రకారమే కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్:
పథకం ప్రకారమే కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు జరుగుతోందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుతో కేసీఆర్, కేటీఆర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఏ విచారణ అధికారైనా వాళ్ల పేర్లు చెప్పారా? అని ప్రశ్నించారు."ఫోన్ ట్యాప్ చేశారని ఎవరైనా ఫిర్యాదు చేశారా? ఊహించి రాసి.. ఇదే జర్నలిజం అంటే ఊరుకునేది లేదు. ఆధారాలు లేకుండా రాస్తే మా చర్యలు కఠినంగా ఉంటాయి. దుష్ప్రచారంపై కేసీఆర్ ఊరుకున్నా మేం ఊరుకోం. దేశంలో ఫోన్ ట్యాపింగ్ ఎక్కడా జరగడం లేదా? ఇప్పుడు ట్యాపింగ్ జరగట్లేదని సీఎం చెప్పగలరా?" అని జగదీశ్‌రెడ్డి అన్నారు.



## హైడ్రాపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,
మాదాపూర్ సున్నం చెరువు దగ్గర హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సోమవారం గరం అయ్యారు. చెరువును బఫర్ జోన్ చేయకుండానే కూల్చివేతలు చేపట్టారంటూ హైడ్రా అధికారులపై మండిపడ్డారాయన.



## అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

- నక్సల్స్‌లో చర్చలు జరపాలంటే ప్రోత్సహించినట్లా
- అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్

హైదరాబాద్,జూన్ 30:
కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ..

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు



2 లో

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కవిత విమర్శలు
- 17న రైల్ రోకో కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్,జూన్ 30:
బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా జూలై 17న రైల్ రోకో నిర్వహించిన తీరుతామని తేల్చిచెప్పారు.

# నానాకాలం చదువులు



'వానాకాలం చదువు'లంటారు. ఇప్పటికీ దేశంలో చాలాచోట్ల వానకీ, చదువుకీ చుక్కెదురే. చెట్ల కిందో, అరుగుల మీదో, అంతంతమాత్రపు కప్పు కిందో బడులు నడిపేటప్పుడుబీ చక్కా నడిచి పోడానికి పక్కారోడ్లు లేనప్పుడు వానాకాలంలో చదువుకు గంట కొట్టి ఇంటికి పరిమితమవక తప్పదు. వెనకటి కాలంలో చదువు చెప్పే రోజులతో సమానంగా నిషేధించే రోజులూ ఉండేవి.అష్టమి, నవమి, చతుర్దశి, అమావాస్య, పౌర్ణమి మొదలైన తిథుల్లో, గ్రహణం పట్టినప్పుడూ అధ్యయనం కూడదు. వాటిని 'అనధ్యయన దినా'లనేవారు. వేదాలు, ఇతర రహస్య విద్యల వల్లింపైతే వర్షాకాలంలో పూర్తిగా నిషిద్ధం. నేర్చుకున్నది మాత్రం నెమరు వేసుకోవచ్చు.క్రమంగా కేలండర్ మారిపోయి వర్షర్తువూ, చదువుల ఋతువూ ఒకేసారి మొదలవడం ప్రారంభించాయి. మినహాయింపులున్నా ఆ రెంటి మధ్యా వైరుధ్యం పోయి సయోధ్య వెల్లివిరుస్తోంది. వానలతో పచ్చదనాన్ని తెచ్చుకుని కొత్త ఉత్సాహాన్ని నింపుకొనే ప్రకృతితో చదువుల ఋతువు పోటీపడుతూ రహదారులనూ, బడితావులనూ పిల్లల సందడితో వర్ణరంజితమూ, కర్ణరంజితమూ చేస్తోంది.మరోపక్క విచిత్రంగా ముల్లు ఈ కొస నుంచి పూర్తిగా దాని వ్యతిరేక దిశకు తిరగడమూ జరుగుతోంది. చదువుల అభావ దినాలు పోయి ఉల్బణ దినాలు వచ్చాయి. ఋతు నిర్బంధాలూ, తిథివార నిషేధాలూ పోయి చదువుల కేలండర్ 'సార్వకాలికత'ను తెచ్చుకుంటోంది. వానా కాలం చదువులు పోయి నానాకాలం చదువులొచ్చాయి. అది మరోరకం వైపరీత్యానికి దారి తీసింది.అంతటా కాకపోయినా, అనేక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో వేసవి సెలవులు కుదించుకుపోతున్నాయి. ప్రత్యేకించి పబ్లిక్ పరీక్షలు రాయబోయే పిల్లలకు వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ పైన వేసవి పొడవునా ట్యూషన్ తరగతులకు హాజరవడం అనివార్యమవుతోంది. భుజాలను వంచే పుస్తకాల బరువుకు తోడు మస్తకాలను భయాందోళనలతో నింపే చదువు బరువూ పెరిగిపోతోంది. 'స్కూలు వర్కు'ను మించి 'హోము వర్కు' నివ్వడంతో బడికీ, ఇంటికీ తేడా చెరిగిపోయి, వేరే వృత్తి ఉద్యోగాల్లో తలమునకలయ్యే తల్లితండ్రులే టీచర్లు గానూ మారి, అదనపు భారాన్ని మోయాల్సి వస్తోంది. తల్లుల పరిస్థితి మరీ ఘోరం. ఉద్యోగానికి అదనంగా వంటపనీ, ఇంటిపనీ, పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూనే ఉపాధ్యాయిని పాత్రనూ పోషించవలసి వస్తోంది.స్త్రీ, పురుష బాధ్యతల మధ్య అసమానతలు కొనసాగుతున్న పరిస్థితిలో గృహిణికి ఇదెంత భారమో ఊహించగలం. స్కూలు ఫీజులూ, ఇతరత్రా వసూళ్ల రూపంలో వేలు, లక్షలు ధారపోస్తున్నా తల్లితండ్రులకు 'టీచరీ' రూపంలో ఈ అదనపు చాకిరీ తప్పడం లేదు. ఆటపాటలతో సహా ఇతరేతర మానసికోల్లాసాలకు ఒకటి, రెండు గంటలైనా ఒత్తిడి లేని స్వేచ్ఛా సమయం చిక్కని పిల్లల పాలిట చదువు అక్షరాలా 'నిర్బంధ' విద్యే అవుతోంది.విద్యాసంస్థలు చదువు బరువు తగ్గించకుండానే అదనపు వేళల్లో ఆటపాటల బరువునూ మోపడంతో పిల్లలకసలే ఊపిరి సలపడం లేదు. దేశంలో విద్యాబోధన ఎంత శాస్త్రీయంగా జరుగుతోందో పట్టించుకునే వ్యవస్థ అసలేదైనా ఉందా, చదువులు పిల్లల శారీరక మానసిక వికాసానికేమైనా సాయపడు తున్నాయా అన్న ప్రశ్నలు తల్లితండ్రుల నుంచే ఎదురవుతున్నాయి. పరీక్షలలో సాధించాల్సిన మార్కుల గరిష్ఠ శాతం కూడా ఇప్పుడు మారిపోయింది. తదుపరి చదువుకు ఏ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలోనైనా సీటు రావడానికి డెబ్బై, ఎనభై శాతం మార్కులు కూడా సరిపోవడం లేదు, తొంభై శాతం దాటి తీరాల్సిందే. దాంతో పిల్లల్లో పోటీ, అసూయ, అలజడి, ఆందోళన, ఒత్తిడి పెరిగి పోతున్నాయి. తమ చదువూ, భవిష్యత్తుల గురించి తల్లితండ్రులు కనే కలల భారం పిల్లల కను రెప్పల మీద పడి వాళ్ళ నిద్రను హరిస్తోంది.పిల్లల్లో గ్రహణశక్తి, చురుకుదనం పెరిగిన మాట నిజమే కానీ, మొత్తంగా నేటి ఈ చదువుల తీరు ఆదర్శవంతమేనా అన్న సందేహం మాత్రం వదలకుండా వేధిస్తూనే ఉంది. ఇక చదువుల్లో రకరకాల అసమానతలు పెరగడమే తప్ప తగ్గుతున్న జాడలేదు. ఉజ్జ్వల భవిష్యత్తు వైపు నడిపించే చదువుల నిచ్చెనపై చివరి మెట్ల మీద చతికిల బడుతున్నవారు నేటికీ అసంఖ్యాకమే.ఇంకోవైపు నూటికి నూరుశాతం అక్షరాస్యతను సాధించడానికి ప్రభుత్వాలు ఇప్పటికీ ఆపసోపాలు పడుతూనే ఉన్నాయి. నూటయాభయ్యేళ్ళ క్రితం, బ్రిటిష్ వలస పాలన ప్రారంభం నాటికి మూడు శాతం పైచిలుకు ఉన్న అక్షరాస్యత ఇప్పుడు ఎనభై శాతానికి చేరడం, విడిగా చూసినప్పుడు ఒకింత ఊరటే కానీ, ఎన్నో దేశాలతో పోల్చితే ఈ పెరుగుదల వేగమూ, శాతమూ ఏమంత విశేషం కావని పెదవి విరిచేవారూ ఉన్నారు. ఇందులో మళ్ళీ ప్రాంతీయంగా, జెండర్ పరంగా అంతరాలూ యథాతథం. ఎప్పుడో కానీ సోదిలోకి రాని ఈశాన్య రాష్ట్రాలు అక్షరాస్యతలో అగ్రస్థానంలో ఉండటం ఒక విశేష మైతే, ఎంత ప్రామాణికమో తెలియదు కాని, బిహార్‌తో కలసి ఆంధ్రప్రదేశ్ ఆ పట్టికలో అడుగు బొడుగు స్థానాలలో కనిపించడం కలవరపరిచే విషయం. ఇక చదువుల నాణ్యత విషయానికొస్తే, పట్టికలో మన దేశం స్థానం ఉసూరుమనిపించే మరో అధ్యాయం.చదువుకీ, మంచి రాబడిగల ఉద్యోగాలకూ పీటముడి పడిన దశలో విద్యాభ్యాసం పూర్తిగా పరుగు పందెంగా మారి పిల్లల్ని విపరీత శ్రమకూ, అలసటకూ గురిచేస్తున్న మాట నిజం. చదువుల మరో పరమార్థమైన జ్ఞాన సముపార్జనకు కూడా పెద్ద పీట వేస్తూ ఎప్పటికది నిలకడ తెచ్చుకుంటుందో, పిల్లల్ని పరీక్షల భయతీరాన్ని దాటించి వైజ్ఞానికపు వెలుగుల ఉల్లాస తీరం వైపు నడిపిస్తుందో కాలమే తేల్చాలి.

## పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

మొదటిపేజీ తరువాయి
అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పూర్తిగా కూలిపోవడంతో సహాయక బృందాలు శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ప్రాణాపాయంగా శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ భవనం నుంచి కేవలం ఆరుగురినే బయటకు తీయగలిగారు. కెమికల్ ఫ్యాక్టరీలో మంటలతో పాటు భారీగా విషవాయువులు విడుదలవడంతో పరిసర ప్రాంతాల్లో ఘాటైన వాసనలు వ్యాపించాయి. స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతూ తమ ఇళ్లలోకి చెదురుమదురుగా చేరుకున్నారు. అప్రమత్తమైన అధికారులు సంఘటనా స్థలానికి ఎవరూ రావొద్దని హెచ్చరించారు. ఈ పేలుడు ఘటన రాష్ట్రాన్ని దిగ్భ్రాం÷-రతికి గురిచేసింది. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అన్నదానిపై విచారణ కొనసాగుతోంది. శిథిలాల తొలగింపు తర్వాత అసలు ప్రమాద స్థాయి ఎంత పెద్దదో అర్థం కానుంది. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. పరిశ్రమ లోపల మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. కార్మికుల్లో పలువురు ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది. చికిత్స పొందుతున్న వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశ్రమ నుంచి ఘాటైన వాసనలు వెలువడుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రియాక్టర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగి పరిశ్రమలో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ప్రమాదంతో స్థానికులు, కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారిని అక్కడి నుంచి దూరంగా పంపించివేసారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సంఘటన స్థలానికి పఠాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మల్టీజోన్ టు ఐజీ సత్యనారాయణ, ఎస్పీ పరితోష్ పంకజ్ చేరుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## బీజేపీకి రాజాసింగ్ రాజీనామా

మొదటిపేజీ తరువాయి
రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నా. కానీ, నా మద్దతుదారుల్ని బెదిరించారు. నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదు. వాళ్లు అనుకున్న వాళ్లకే పదవి ఇచ్చారు. అందుకే బీజేపీకి రాజీనామా చేస్తున్నా. రాష్ట్ర అధ్యక్షుడికి రాజీనామా లేఖ ఇవ్వడానికే వచ్చా. నాకు మద్దతుగా ముగ్గురు కౌన్సిల్ సభ్యులు కూడా రాజీనామా చేశారు. రాజాసింగ్ మా పార్టీ సింబల్ మీద గెలిచాడు ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్యే కాదని, సస్పెండ్ చేయాలని కిషన్‌రెడ్డే స్పీకర్‌ను కోరాలి.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎంతో పోరాడాం. కానీ, పార్టీ అధికారంలోకి రాకూడదనే ఎక్కువ మంది కోరుకుంటున్నారు. బీజేపీ కోసం సర్వం ధారపోశాను. నేను, నా కుటుంబం టెర్రరిస్టుల టార్గెట్‌లో ఉన్నాం. పార్టీ కోసం ఇంత పని చేసినా ఏం లాభం?. అందుకే పార్టీకి లవ్ లెటర్ ఇచ్చి వెళ్తున్నా. మీకో దండం.. మీ పార్టీకో దండం. లక్షల మంది కార్యకర్తల బాధను ప్రతిబింబించే రాజీనామా ఇది(అంటూ లేఖను చూపించారాయన). బీజేపీకి రాజీనామా చేసినా.. హిందుత్వం కోసం పోరాడుతూనే ఉంటాను అని రాజాసింగ్ ప్రకటించారు.

## అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

మొదటిపేజీ తరువాయి
కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్ట్‌ల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. 'ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్ట్‌ల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసిది' అంటూ ÷ర్ అయ్యారు.శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్ ÷ర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎ ల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. ఎల్బీ స్టేడియంలో జులై 4న ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను సోమవారంకాంగ్రెస్ నేతలు పరిశీలించారు. జూలై 4న ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం సభకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిట శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

## ఉచిత బస్సు పొందిన 191 కోట్ల మంది మహిళలు

మొదటిపేజీ తరువాయి
ఆర్టీసీలో ఇప్పటి వరకు 191 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, వారి ప్రయాణం విలువ రూ.6,300 కోట్లు ఉంటుందని మంత్రి తెలిపారు. ముషీరాబాద్‌లో పదవీవిరమణ పొందుతున్న 14 మంది ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. వారి సేవల్ని కొనియాడారు. అంతకుముందు అధునాతన టెక్నాలజీ ద్వారా ఆర్టీసీ అమలు చేస్తోన్న డిజిటల్ పేమెంట్స్ అమలును మంత్రి పొన్నం పరిశీలించారు. రవాణా శాఖ చెక్‌పోస్టుల మూసివేత అంశం కేంద్రం ప్రతిపాదనలో ఉందని, దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఈవీ పాలసీ తీసుకొచ్చిందని, రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టులు సాంకేతికంగా అమలు చేసేలా మార్పులు చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో అనేక సంస్కరణలు, ఆర్టీసీ ఉద్యోగులకు సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ పాత బకాయిలు చెల్లిస్తూ, నూతన నియామకాలు చేపట్టామని, కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని వివరించారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు

మొదటిపేజీ తరువాయి
సోమవారం తన నివాసంలో సింగరేణి జాగృతి రూపొందించిన రైల్ రోకో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బిసి సమాజం, తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ పోరాటాలతోనే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు వేర్వేరు బిల్లులు పాస్ చేసిందని గుర్తు చేశారు. ఈ బిల్లులకు చట్టబద్ధత కల్పించేందుకు వెంటనే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకే తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో జూలై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన రైల్ రోకో చేసి తీరుతామని తెలిపారు. రైల్ రోకోకు సింగరేణి జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని వెల్లడించారు. బిసిల రిజర్వేషన్ల పెంపు, రైల్ రోకో అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. జూలై 16, 17, 18 తేదీల్లో ఎవరూ ప్రయాణాలు పెట్టుకోవద్దని ఎంఎల్‌సి కవిత మరోసారి విజ్ఞప్తి చేశారు. ÷ుంగరేణి కాలరీస్ సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వాలని ఎంఎల్‌సి కవిత డిమాండ్ చేశారు. సింగరేణిలో పని చేస్తున్న కార్మికులు సర్వేయర్ కోర్సు పూర్తి చేసి డిజిఎంఎస్ నుంచి సర్టిఫికెట్లు అందుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి సర్వేయర్ కోర్సు పూర్తి చేసిన వారి కోసం నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.

## హైడ్రాపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి
"చెరువులు కబ్జాకు గురికాకుండా అభివృద్ధి చేయాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన. కానీ, హైడ్రా తీరు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా ఉంది. హైడ్రా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. సున్నం చెరువు బఫర్ జోన్ చేయకుండా కూల్చివేతలు చేపట్టారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌ను కలుస్తా" అని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.ఇదిలా ఉంటే.. సున్నం చెరువు హైడ్రా కూల్చివేతలు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీశాయి. పలువురు ప్రొక్లెయిన్‌కు అడ్డం పడి హైడ్రా డౌన్ డౌన్.. హైడ్రా కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అన్యాయంగా తమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే అధికారులు మాత్రం భారీ బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగించారు.

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు.. కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి
ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని, అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పును పరిశీలించాల్సి ఉందని తెలిపింది. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించడం అత్యవసరమని కమిటీ అభిప్రాయపడింది.

### కేంద్రం నిర్ణయం హర్షణీయం: కవిత

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి నిరాకరించడం హర్షణీయమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ నిర్ణయం తెలంగాణ జాగృతి, భారాస సాధించిన విజయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇకనైనా తెలంగాణ ప్రయోజనాల కోసం పని చేయాలన్నారు. " బనకచర్లపై అపెక్స్ కౌన్సిల్ నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాలి. రాష్ట్రానికి 968 టీఎంసీలను ప్రాజెక్టుల వారీగా కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలి" అని కవిత డిమాండ్ చేశారు.

## లక్షల కోట్లు దోచుకుతిన్నారు.. బీఆర్ఎస్ పై మంత్రి పొంగులేటి ఫైర్

మొదటిపేజీ తరువాయి
8 లక్షల కోట్లు అప్పు ఉన్న.. వాటికి మిత్తి కడుతూ పేద ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేస్తున్నామన్నారు.గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేసిందని ఫైర్ అయ్యారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి విద్యకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో కూడా సన్న బియ్యం ఇవ్వడం లేదని.. దేశంలోనే ఒక్క తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. ఎన్నికల ఉన్నప్పుడే గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇచ్చిందని.. ఇందిరమ్మ రాజ్యంలో మాత్రం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తున్నామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేకున్నా రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు వేశామని గుర్తు చేశారు. ధరణి పోర్టల్?ను బంగాళాఖాతంలో కలిపి రైతుల కోసం భూభారతి చట్టం తీసుకువచ్చి రైతులకు మేలు చేస్తున్నామని చెప్పారు. మొదటి విడతగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని తెలిపారు. పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## విధేయతకే బిజెపి పెద్దపీట

ఆంధ్రప్రదేశ్ బీజేపీకి కొత్త అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో, పార్టీ విధేయులకు బీజేపీ పెద్దపీట వేస్తోందని మరోసారి రుజువైంది.. దశాబ్దాలు తరబడి పార్టీని నమ్ముకున్న వారికే పదవులు కట్టబెట్టుతోంది. అందులో భాగంగా తెలుగు రాష్ట్రాల అధ్యక్షులను ఎంపిక చేసింది. రాష్ట్ర నేతలు ఒకటి తలిస్తే.. హైకమాండ్ మరొకటి చేస్తోంది. ఇటు ఆంధ్రప్రదేశ్, అటు తెలంగాణ అధ్యక్షుల ఎంపికలో వ్యూహాత్మకంగా వ్యవహరించింది. సీనియర్లు, ఆశావహులకు షాకిస్తూ.. కొత్త అధ్యక్షులను ఎంపిక చేసింది. ఇక్కడ మాధవ్, తెలంగాణలో రాంచంద్రరావులు ఇద్దరూ ఆదినుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారు. వివిధ హోదాల్లో పార్టీకి సేవలు అందించారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తండ్రి చలపతిరావు కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా పని చేశారు. ఇప్పుడు మాధవ్ అధ్యక్ష బాధ్యతలు చేపడితే.. తండ్రీ కొడుకులిద్దరూ రాష్ట్ర అధ్యక్షులుగా పని చేసినట్లవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇదో రికార్డు. మాధవ్ తండ్రి చలపతిరావు.. కాషాయ పార్టీకి తొలితరం నాయకుల్లో ఒకరు. ఆయన ఎమ్మెల్సీగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొలి బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఉన్న బీజేపీ సీనియర్ నేతలకు చలపతిరావు గురువులాంటి వారు. పీవీఎన్ మాధవ్ పూర్తి పేరు పోకల వంశీ నాగేంద్ర మాధవ్. 1973 ఆగష్టు 10వ తేదీన.. విశాఖ జిల్లా మద్దిలపాలెంలో జన్మించారు. మాధవ్ ఉన్నత విద్యావంతుడు. కాస్ట్ అకౌంటెంట్ కోర్సు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయలో చదివారు. ఆయన రాజకీయ ప్రయాణం అఖిల భారత్ విద్యార్థి పరిషత్‌తో ప్రారంభమైంది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం జూలై 01 2025

# పొలం బాట కొరకు వ్యక్తి హత్య

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

పొలానికి బాట విషయంలో గొడవ ఒక వ్యక్తి దారుణ హత్యకు దారితీసింది పొలానికి బాట విషయంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన దౌల్తాబాద్ మండలంలో చోటుచేసుకుంది.ఎస్ఐ రవి గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బండివాడ తండా గ్రామానికి చెందిన చౌహాన్ బాబు నాయక్, అతడి తండ్రి బద్రి నాయక్, తమ్ముడు చౌహాన్ వెంకట్ నాయక్‌లకు.. హనుమా నాయక్ తండాకు చెందిన ధనావత్ విజయ్ నాయక్, మాన్య నాయక్, వెంకట్ నాయక్, అజయ్ నాయక్, రవి నాయక్‌లకు పొలానికి బాట విషయంలో ఆదివారం మధ్యాహ్నం గొడవ జరిగింది.ఇదే విషయంలో గత కొన్నేళ్లుగా వారి మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం జరిగిన గొడవ అనంతరం చౌహాన్ బాబు నాయక్ దౌల్తాబాద్ పీఎస్‌కు వెళ్లి ప్రత్యర్థులపై చేశారు.



అనంతరం చౌహాన్ బాబు నాయక్, అతడి చిన్న కొడుకు శ్రీరాములు ఒక బైకుపై, బాబూ నాయక్ తమ్ముడు వెంకట్ నాయక్, అతడి కొడుకు శ్రీధర్ నాయక్ మరో బైకుపై దౌల్తాబాద్ నుంచి తండాకు వెళుండగా రాత్రి 10 గంటలకు మార్గమధ్యలో హనుమా నాయక్ తండా దగ్గర ప్రత్యర్థులు అడ్డగించారు.

తండాకు చెందిన ధనావత్ జైపాల్ నాయక్, ధనావత్ రాములు నాయక్, ధనావత్ మాన్యా నాయక్, ధనావత్ విజయ నాయక్, ధనావత్ వెంకట్ నాయక్, దనావత్ రవి నాయక్, ధనావత్ బాద్య నాయక్, అమ్రి బాయి కలిసి బాబూ నాయక్ కుటుంబంపై కట్టెలతో, ఐరన్ రాడ్‌లతో దాడి చేశారు. ఈ దాడిలో చౌహాన్ బాబు నాయక్ కుడి చేయి, కుడి భుజానికి గాయాలయ్యాయి. బాబూ నాయక్ కొడుకు శ్రీరామ్ ఛాతిపై, కుడి చేయిపై కందిన గాయాలయ్యాయి.

బాబూ నాయక్ తమ్ముడు చౌహాన్ వెంకట నాయక్ (37) తలకు బలమైన గాయమైంది. దాంతో అతడిని చికిత్స నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్ లో హైదరాబాద్‌కు తీసుకుని వెళుతుండగా మార్గమధ్యలో మొయినాబాద్ దాటిన తర్వాత మధ్యరాత్రి ఒంటిగంట సమయంలో వెంకట్ నాయక్ చనిపోయినాడు. చౌహాన్ బాబు నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొడంగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ శ్రీధర్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు.

# దేశవ్యాప్తంగా ఈ-పాస్‌పోర్ట్ సేవలు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

దేశంలో పాస్‌పోర్ట్ సేవల వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది.పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ వెర్షన్ 2.0 లో భాగంగా ఈ-పాస్‌పోర్ట్‌ను ప్రవేశపెట్టింది. పాస్‌పోర్ట్‌ల భద్రతను మెరుగుపరచడం, ఇంటర్నేషనల్ ప్రయాణాలను స్ట్రీమ్‌లైన్ చేయడం, నకిలీ, ట్యాంపరింగ్ నుంచి పాస్‌పోర్ట్ హోల్డర్ల వ్యక్తిగత డాటాను సంరక్షించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇప్పటివరకు పైలట్ ప్రాజెక్టుగా కొద్ది నగరాలకే పరిమితమైన 'ఈ-పాస్‌పోర్ట్' సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు ప్రకటించింది.'పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ 2.0' (Passport Seva 2.0) కింద ఈ అత్యాధునిక సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ గతవారం అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే.ఈ కొత్త విధానం ప్రయాణికులకు పూర్తిస్థాయి డిజిటల్ ఇండియా అనుభూతిని అందిస్తుందని ఆయన పేర్కొన్నా




**- ఈ-పాస్ పోర్ట్ అంటే ఏమిటి ?**

ఇది సంప్రదాయ పేపర్ డాక్యుమెంట్ వంటిదే. ఈ-పాస్‌పోర్ట్ కవర్‌పై బంగారు వర్ణపు చిన్న సింబల్ ఉంటుంది.సంప్రదాయ పాస్‌పోర్ట్‌లకు భిన్నంగా ఇందులో ఎలక్ట్రానిక్ చిప్ ఉంటుంది. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) టెక్నాలజీతో ఈ-పాస్‌పోర్ట్ అనుసంధానమై ఉంటుంది. పాస్‌పోర్ట్ కవర్‌లో చిప్, యాంటెన్నా పొందుపరిచి ఉంటాయి. ఈ చిప్‌లోనే పాస్‌పోర్ట్ హోల్డర్ల వ్యక్తిగత, బయోమెట్రిక్ డాటా తదితర కీలకమైన వివరాలు నిక్షిప్తమై ఉంటాయి.తద్వారా అంతర్జాతీయ ప్రయాణాల సమయంలో అథెంటికేషన్ సులభతరం అవుతుంది.

**- దరఖాస్తు ఎలా చేయాలి**

ఈ-పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకునే వారు ముందుగా అధికారిక పాస్‌పోర్ట్ సేవా ప్లాట్‌ఫామ్‌ను సందర్శించాలి.కొత్త వినియోగదారులు అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. ఇప్పటికే అకౌంట్ ఉన్నవారు నేరుగా లాగిన్ కావొచ్చు.ఆన్‌లైన్‌లో అప్లికేషన్ ఫారంను నింపి, సమీపంలోని పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (పీఎస్‌కే) లేదా పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో (పీఓపీఎస్‌కే) అపాయింట్‌మెంట్ తీసుకోవాలి.ఇ-పాస్‌పోర్ట్ కోసం నిర్ణీత ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలి.అనంతరం బయెమెట్రిక్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం షెడ్యూల్ చేసిన తేదీన పీఎస్‌కే లేదా పీఓపీఎస్‌కేను సందర్శించి ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది

# నేటి నుండి పెరుగుతున్న రైలు ఛార్జీలు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

**- పెరగనున్న రైలు టికెట్ చార్జీలు**

జులై ఒకటి నుంచి రైలు టికెట్ చార్జీలు పెరగనున్నాయి. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏసీ, నాన్ ఏసీ క్లాస్ చార్జీలను పెంచేందుకు రైల్వేమంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తున్నది. నాన్ ఏసీ (స్లీపర్, సెకండ్ సీటింగ్) కేటగిరిల్లో టికెట్‌పై కిలోమీటర్‌కు ఒక పైసా, థర్డ్ ఏసీ నుంచి ఫస్ట్ ఏసీ వరకు అన్ని క్లాస్‌లలో కిలోమీటర్‌కు 2 పైసలు పెరగనున్నది. 500 కిలోమీటర్ల వరకు ప్రయాణానికి సెకండ్ క్లాస్ రైలు టికెట్ల ధరలు, ఎంఎస్‌టీలో ఎలాంటి మార్పులు




ఉండవు. కానీ, 500 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటే.. ఆ ప్రయాణికులు ప్రతి కిలోమీటర్‌కు అర పైసా చెల్లించాల్సి ఉంటుంది.

**- తత్కాల్ బుకింగ్ ఇక కఠినం**

రైల్వేశాఖ జులై ఒకటి నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్‌ను కఠిన తరం చేసింది. ఇకపై తత్కాల్ టికెట్లు ఐఆర్‌సీటీసీ అకౌంట్‌తో ఆధార్ లింక్ చేసిన ప్రయాణికులకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. జులై ఒకటి నుంచి ఓటీపీ ఆధారిత అథంటికేషన్ తప్పనిసరి చేసింది. దాంతో ఆధార్ అకౌంట్‌తో లింక్ చేయబడిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. తత్కాల్ బుకింగ్ ప్రారంభమైన మొదటి అరగంటలో రైల్వే ఏజెంట్లు బుకింగ్ చేసేందుకు అనుమతి ఉండదు. ఏజెంట్లు పెద్ద ఎత్తున టికెట్లను బుక్ చేస్తున్నారని విమర్శల నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ ఈ నిర్ణయం తీసుకున్నది. దాంతో ప్రయాణికులకు ఊరట కలుగనున్నది.

# పదవి విరమణ పొందిన ఎంపిడిఓ కు సన్మానం

**- నూతన ఎంపిడిఓ కు ఆహ్వానం**

గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లో ఎంపీడీవోగా పదవి విరమణ పొందిన సాంబారి చంద్రశేఖర్ ను సోమవారం పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డు అసిస్టెంట్లు, కంప్యూటర్ అపరేటర్ లు ,కార్యాలయ సిబ్బంది శాలువ, పూలమాలలతో సత్కరించి పలు జ్ఞాపికలు అందజేశారు.అతని స్థానంలో కోరుట్ల ఎంపిడివో



పదవి విరమణ పొందిన ఎంపీడీవోను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీ రామకృష్ణ, ఇబ్రాహీంపట్నం నూతన ఎంపిడివో గా బాధ్యతలు స్వీకరించారు.ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది,ప్రముఖులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కోరుట్ల ఎంపిడివో శ్రీ రామకృష్ణ

## ఇబ్రహింపట్నంలో ప్రజావాణి కార్యక్రమం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి**

జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రంలోని తహసీల్ కార్యలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలుశాఖల కు చెందిన అదికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నరు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, ఎంఈఓ బండారి మధు, ఎపియం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి విద్యుత్ శాఖ నూతన డిఈఈ గా మధుసూదన్



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి**

విద్యుత్ శాఖ మెట్ పల్లి డివిజన్ నూతన డిఈఈ గా సోమవారం పదవి బాధ్యతలు చేపట్టిన మధుసూదన్ ని జగిత్యాల జిల్లా 327 ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు మరియు 327 యూనియన్ ప్రధాన కార్యదర్శి రాంజీ నాయిక్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకముగా కలిసి సాల్వతో ఘనంగా సన్మానించి మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది.

## బిఆర్ఎస్ నాయకుడు సరికొండ యాదయ్య మృతి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సరికొండ యాదయ్య (48) మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సరికొండ యాదయ్య మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సోమవారం వేముల్‌నర్వకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి మాట్లాడారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడంతోపాటు గ్రామంలో బీఆర్ఎస్ పటిష్ఠత కోసంపాటు పడ్డాడన్నారు. యాదయ్య మృతి పార్టీకి తీరనిలోటని, ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పర్వత్‌రెడ్డి, జగత్‌రెడ్డి, కె.యాదయ్య, చిర్ర చంద్రయ్య, డి.నర్సింహా, కె రమేశ్, కె రాజు, భూపాల్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేశాపూర్ లో పౌర హక్కుల దినోత్సవం



పౌరహక్కుల దినోత్సవం నిర్వహించిన దృశ్యం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కేశాపూర్ గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం జరిగింది.ఈసందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం అవరణం లో పౌరహక్కుల గురించి రెవెన్యూ అధికారులు గ్రామస్తులకు వివరించారు.ప్రతి ఒక్కరూ చట్టాలపైన అవగాహన పెంచుకోవాలని అధికారులు పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

**- కుంగిన కాళేశ్వరం, దరిద్రమైన ధరణి వారి అసమర్థ పాలనకు నిదర్శనాలు....**

**ములకలపల్లి, కరపత్రం ప్రతినిధి జూన్ 30:**

గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం అని, అన్ని వర్గాల వారికి తీవ్ర అన్యాయం చేశారని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. సోమవారం ములకలపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి మాదారంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ములకలపల్లి లో సీసీ రోడ్లు, జగన్నాధపురం, పాత గంగారంలో బీటీ రోడ్లు, సీతాయి గూడెంలో పంచాయతీ భవనం, కమలాపురం, చాపరాలపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో రూ. 2.80 కోట్లతో నిర్మించిన సీసీ, బీటీ రోడ్లను ప్రారంభించారు. చాపరాలపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రూ.22వేల కోట్లతో రైతు భరోసాను అమలు చేసిందని, రూ. 12వేల కోట్లతో పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తోందని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గతంలో పదేళ్ళు ఉన్న బీఆర్ఎస్ సర్కార్ హయాంలో చేసిందేమీ లేదని.. కుంగిన, కూలిన కాళేశ్వరం, దరిద్రమైన ధరణి మాత్రమే కనిపిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పాలనను ఓర్వలేక.. తప్పుడు ఆరోపణలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని, ఈ తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
మంగళవారం జులై 01 2025

# తెలంగాణ ఉద్యమకారుల శాంతియుత నిరసన దీక్ష

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ వద్ద నిర్వహించారు . శాంతియుత నిరసన దీక్షలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి హాజరై మాట్లాడుతూ...

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో గత దశాబ్ద కాలం నుండి తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్నటువంటి ఉద్యమకారుల గురించి కొట్లాడుతున్న సందర్భం విదితమే.. దేశ స్వాతంత్రం కోసం కొట్లాడినటువంటి ఉద్యమకారులను స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించినట్టు... 60 ఏళ్ల ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడినటువంటి ఉద్యమకారులను గుర్తించాలని గడిచిన కొన్ని సంవత్సరాలుగా వివిధ రూపాలలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తమ నిరసనను తెలియజేస్తుందని.. అన్నారు కాంగ్రెస్




ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఉద్యమకారులందరినీ గౌరవించుకుంటామని వారికి 250 గజాల ఇంటి స్థలాన్ని.. మరియు పెన్షన్.... సంక్షేమ బోర్డు లాంటి హామీలను పొందుపరచడం జరిగింది రెండు సంవత్సరాలు గడుస్తున్న విషయాలపై ఇలాంటి స్పష్టత లేకుండా ఎలాంటి విధివిధానాలను ప్రకటించకుండా దౌర్భాగ్యమని అన్నారు ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వాన్ని చెప్పుకుంటున్న మన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల సానుకూలంగా స్పందించి వెంటనే ఉద్యమకారులను గుర్తించే విధంగా




విధివిధానాలను ప్రకటించాలని ఈ సందర్భంగా కోరడం జరిగింది రానున్న రోజుల్లో ఉద్యమకారులుగా డిమాండ్ సాధించడం కోసం త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటించడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కేయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యులు జీకే గారు...టి యు ఎఫ్ నియోజకవర్గం నాయకులు దబ్బేట రాజు గారు.జమ్మికుంట మండల అధ్యక్షులు పొట్టాల మల్లేష్ గారు.. మండల ప్రధాన కార్యదర్శి పాకాల మల్లారెడ్డి గారు.. తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది(జిపి)గా ఫరిదోద్దీన్ నియామకం



**సూర్యాపేట జిల్లా కరపత్రం ప్రతినిధి జూన్ 30**

సూర్యాపేట జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది(జిపి)గా ఫరిదోద్దీన్ సోమవారం సూర్యాపేట జిల్లా జడ్జి చేతులమీదుగా ప్రభుత్వ నియామక ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మాజీమంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డికి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి కి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ కి, డీసీసీ అధ్యక్షుడు, వ్యవసాయ,రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ కి, జిల్లా లీగల్ సెల్ చైర్మన్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది నూకల సుదర్శన్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

# సేద్యం చేసిన భూమికే రైతు బంధు

**- గ్రీవెన్స్ లో మహిళా రైతు ఫిర్యాదు**

**తిరుమలాయపాలెం: జూన్ 30 కరపత్రం ప్రతినిధి**

తిరుమలాయపాలెం, మండల పరిధిలోని పిండిప్రోలు రెవిన్యూ పరిధిలో గల పొనుగుపాటి భవాని భర్త రామకృష్ణ నివాస గ్రామం రామాపురం ,చిలుకూరు మండలం ,సూర్యాపేట జిల్లా, నివాసి వీరు పిండిప్రోలు గ్రామం పరిధిలో సర్వేనెంబర్ 518 / క 0 -17 కుంటలు భూమి 517/ ఈ4బి18 కుంటలు 519/ ఖ 14 కుంటల భూమి మొత్తం5బి9 కుంటల భూమి కలదు, మా భూమి యొక్క పాసుబుక్ నెంబర్%% 26180191513 ఖాతా నెంబర్60303 పట్టా సాకుకు అనుకూలమైన భూమి కలదు గత ఖరీఫ్ రబి



లో కూడా పంటలు వేసినాము కానీ మాకు రైతుబంధు నిలిపి వేసినారు కావున తమరు పరిశీలించి మా యొక్క సేద్య భూమికి రైతుబంధు ఇప్పించగలరని కోరుతూ తహసిల్దార్ ఆఫీసులో దరఖాస్తు ఇవ్వడం జరిగింది

ఇట్టి విషయంపై తహసిల్దార్ ని ఏవో ని వివరణ కోరగా ఎవరైతే భూమిని సేద్యంలో ఉంచుతారో వారికి మాత్రమే రైతుబంధు సకాలంలో పడుతుందని లేనియెడల రైతుబంధు నిలిపివేయబడుతుందని వివరణ ఇవ్వడం జరిగింది. వ్యవసాయ అధికారి ఏవో తిరుమలాయపాలెం కావున రైతులు ఇట్టి విషయాన్ని గమనించి రైతుబంధు రావాకపోవటానికి గల కారణాలను ఏ కారణం చేత రైతుబంధు రావటం లేదు అనే విషయాన్ని గమనించవలసిందిగా, ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు అనుకూలంగానే రైతుబంధు నిలిచిపోతుందని, దీనిని రైతులు అర్థం చేసుకోవాలని వ్యవసాయ అధికారి ఏవో వివరణ ఇవ్వడం జరిగింది

# జమాతే ఇస్లామి హింద్ మైనారిటీ విద్యార్థులకు నోట్ బుక్స్ లు స్కూల్ బ్యాగులు పంపిణీ

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

అర్మూర్ లో రేపు జమాతే ఇస్లామీ హింద్ అర్మూర్ ఆధ్వర్యంలో ఎస్ఎస్సీ మరియు ఇంటర్మీడియట్ మైనారిటీ టాపర్స్ విద్యార్థులకు 'యాకూబ్ సరోష్ మెమోరియల్ మెరిట్ అవార్డు' ప్రదానోత్సవం, అలాగే అవసరమున్న మైనారిటీ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు మరియు నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం జూలై 1, 2025 (మంగళవారం) ఉదయం 10:30 గంటలకు సయిదాబాద్ అర్మూర్ లోని ఉర్దూ ఘర్ షాదీ ఖానా లో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం.ఎన్. బేగ్ జాహీద్ (రాష్ట్ర కార్యదర్శి జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ), వెంకటేశ్వర రెడ్డి (ఏసీపీ అర్మూర్),.రాజా గంగారం (ఎంఈఓ అర్మూర్), ఇ.రాజశేఖర్ ఈ ఆర్ సంస్థ అధ్యక్షుడు మరియు మొహమ్మద్ మంజూర్ (జిల్లా అధ్యక్షులు జమాతే ఇస్లామీ హింద్ నిజామాబాద్) హాజరుకానున్నారు.

అర్మూర్ ప్రజలందరినీ ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను అభినందించి, వారి ప్రోత్సాహాన్ని పెంపొందించగలరని జమాతే ఇస్లామీ హింద్ అర్మూర్ అధ్యక్షుడు కారియా కర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జాతీయ రహదారి ప్రక్కనే "ఐ టి ఐ" కళాశాల నిర్మించాలని ధర్నా

**- తాసిల్దారు, ఎంపీడీవో లకు అఖిల పక్షం ఆధ్వర్యంలో వినతి.**

**తిరుమలాయపాలెం: జూను 30 కరపత్రం ప్రతినిధి**

తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మంజూరు అయిన ఐటిఐ కళాశాలను 254 సర్వే నెంబరు ప్రభుత్వ భూముల్లో రోడ్డు ప్రక్కన నిర్మించాలి కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ముందు అఖిలపక్షాల ఆధ్వర్యంలో ధర్నా మండల కేంద్రంలో ఐటిఐ కళాశాల, గత సుదీర్ఘ పోరాటాల అనంతరం ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది.రెవెన్యూ శాఖ మంత్రి,పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అఖిల పక్షం తరుపున, మండల ప్రజల తరుపున ధన్యవాదాలు, ఈ ఐటిఐ కళాశాలను, జాతీయ రహదారి పక్కన కాకుండా, తమరికి తప్పుడు సమాచారం అందిస్తూ,ఊరికి దూరంగా కట్టాలనే, చెప్పుతున్న వారి మాటలను వినకుండా అట్టి ఆలోచనను విరమించుకొని, రోడ్డు ప్రక్కన కట్టడం వల్ల మండలం లోని అన్ని గ్రామాల ప్రజలకు, విద్యార్థుల కు,అందుబాటులో ఉండటానికి అవకాశం ఉంది. జాతీయ రహదారి ప్రక్కన ప్రభుత్వ భూమి ఉంది దీనిలో కట్టడం వలన మండల కేంద్రం కూడా అభివృద్ధి కావటానికి



అవకాశం ఉన్నది ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టల్స్ అన్నీ కూ ఊరిలోపలకుండటం వలన మండల కేంద్రంలో అభివృద్ధి ఆగుపడటం లేదు. ఇప్పటికైనా మంత్రి స్పందించి పెట్రోల్ బంకు పక్కన ఉన్న 254 సర్వే నెంబర్ లో గల ప్రభుత్వ భూమిలో కళాశాల నిర్మించి మండల ప్రజలను విద్యార్థులను ఆదుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు అనంతరం మెమొరాండాన్ని తాసిల్దార్, ఎంపీడీవోలకి వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, బిఎస్పి పాలేరు అసెంబ్లీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు,ఎన్నబోయిన రమేష్, కొమ్ము పూలే, బి ఆర్.ఎస్ నాయకులు గంట కృష్ణ, గుగ్గిల అశోక్, ఎమ్మార్పీఎస్ నాయకులు పగిడిపల్లి బాబు,చింతి రాల రాంబాబు,వంగూరి మధు, సిపిఐ మండల నాయకులు చీమ రామకృష్ణ,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు తిమ్మిడి హనుమంతరావు కొమ్ము నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలి...

**- ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక రవాణా చేయాలి...**
**- సిపిఎం నియోజకవర్గం కార్యదర్శి బండి రమేష్...**




**కూసుమంచి, కరపత్రం ప్రతినిధి జూన్ 30...**

రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని, ఉచితంగా ఇసుక రవాణా చేసి,బేస్ మట్టం కట్టిన వారికీ లక్ష రూ. మంజూరు చేయాలని సిపిఎం పాలేరు నియోజకవర్గం కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం కూసుమంచి పార్టీ కార్యక్రమంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ....ప్రస్తుతం ఇస్తున్న ఐదు లక్షల రూ. ఇందిరమ్మ ఇళ్లకు సరిపోవని, ఇనుము, సిమెంట్, ఇతర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని,పెరిగిన ధరలకు అనుగుణంగా ఇండ్ల రేటును పెంచాలని కోరారు.అదే విధంగా సన్న దాన్యానికి బోనస్ వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని సూచించారు.కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షకుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ జులై 9 న నిర్వహించే నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.పార్టీ నాయకులు బిక్కసాని గంగాధర్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఎం సన్మత్ రావు, మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్,కార్యదర్శి వర్గ సభ్యులు శీలం గురుమూర్తి,మూడు గన్యా నాయక్,టి వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, మండల కమిటీ సభ్యులు చిట్టూరి వెంకన్న, చీర్ల రాధాకృష్ణ,గోపే వెంకన్న, జవ్వాజి శ్రీను,ఉపేందర్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు అందించేందుకు హౌసింగ్ పీడీ ఎంతగానో కృషి.

**- ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సాధారణం**
**- హౌసింగ్ పీడీ ధర్మారెడ్డి పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట జిల్లా కరపత్రం ప్రతినిధి జూన్ 30**

సూర్యాపేట జిల్లాలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు హౌసింగ్ పీడీ ధర్మారెడ్డి ఎంతగానో కృషి చేశారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో హౌసింగ్ పీడీ ధర్మారెడ్డి పదవి విరమణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలు అనుసరిస్తూ ప్రజల నుండి స్వీకరించిన ఇందిరమ్మ ఇండ్ల అర్జీలను హౌసింగ్ ఏఈల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఏఈలకు ముందుగా శిక్షణ ఇచ్చి తదుపరి క్షేత్రస్థాయి పరిశీలించేందుకు పిడి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం



మొదలు పెట్టినప్పటి నుండి ప్రతి రోజు తాను మొదటి ఫోన్ కాల్ అలాగే చివరి ఫోన్ కాల్ హౌసింగ్ పీడీకే చేసి ప్రతిరోజు వివరాలు తెలుసుకునేదని తెలిపారు. 1983 నుండి 2025 వరకు42 సంవత్సరాల పాటు హౌసింగ్ శాఖలో వివిధ పనిచేస్తూ ఉన్నత స్థాయికి చేరుకున్నారని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు సంతృప్తిగా సేవ చేసేందుకు కుటుంబ సభ్యుల సహకారం ఎంతగానో ఉంటుందని కొనియాడారు. పదవి విరమణ ప్రతి ప్రభుత్వ ఉద్యోగులకు సర్వసాధారణమని వచ్చే రోజుల్లో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, కుటుంబ సభ్యులతో గడుపుతూ ఉన్న స్థాయికి చేరుకోవాలని ప్రజలకి ఏమైనా అవసరం ఉంటే సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.తదుపరి హౌజింగ్ పి డి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ శంకర్ హౌసింగ్ డీఈ జబ్బార్ హౌసింగ్ ఏఈ లు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.